క్లుప్తంగా

పోర్టులో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టులో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. లాజిస్టిక్ వర్క్‌షాపు, వేర్‌హౌస్ ఆఫీస్, ఎస్ఎస్ 2 బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సీఈఓ జగదీష్ పటేల్ ప్రారంభించారు. మోడరన్ ఐ హాస్పిటల్ – రీసెర్చ్ సెంటర్, అదానీ ఆక్యుపేషనల్ హెల్త్ సెంటర్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో 422 మందికి కంటి వైద్య పరీక్షలు జరిపారు. మందులు అందజేశారు.

యోగా సెంటర్ ప్రారంభం

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో శ్రీత్యాగరాజస్వామి సంగీత కళాక్షేత్రం ప్రాంగణంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వివేకానంద ఉచిత యోగా సెంటర్‌ను తహసీల్దార్ కె.స్ఫూర్తి గురువారం ప్రారంభించారు. ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు, ఎంఈఓ జీ.వసంతకుమారి, ఈఓపీఆర్డీ సాయిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్, నేతలు మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కరకటి మల్లికార్జున, పాటూరి రమేష్, నాసిన ప్రసాద్ పాల్గొన్నారు.

తిరుపతిలో తొక్కిసలాట బాధాకరం

బుచ్చిరెడ్డిపాళెం: తిరుపతిలో జరిగిన తొక్కిసలాట బాధాకరమని, ఈ ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని అల్లుఅర్జున్ అభిమాని చోళం వెంకయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుచ్చి పట్టణంలోని పార్క్ సెంటర్ వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో సంధ్యా థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో అల్లుఅర్జున్‌ను అరెస్ట్ చేసినట్లే ఇక్కడ కూడా సంబంధిత ఈఓ, చైర్మన్, అధికారులను సస్పెండ్ చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. శ్రీహరి, పెంచలబాబు, సుబ్బారావు, శ్రీకాంత్, వంశీ, అబ్దుల్లా పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ శ్రీహరి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏపీఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో సంక్రాంతి వేడుకలు

మనుబోలు: విద్యాసంస్థల్లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. మనుబోలు మండలంలోని మడమనూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, మనుబోలు సుశృత పాఠశాలల్లో వేడుకలు జరిగాయి.

➡ పొదలకూరు: అమరావతి స్కూల్లో విద్యార్థులకు సంక్రాంతి విశిష్టతను తెలియజేస్తూ భోగిపండ్లు పోశారు. కరస్పాండెంట్ కె.సురేష్ మాట్లాడారు. విజేత స్కూల్లో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. భోగిమంటలను వేశారు. కరస్పాండెంట్ జీ.కామాక్షి మాట్లాడారు. నాగార్జున స్కూల్లో సంబరాలు జరిగాయి. ముగ్గుల పోటీలను నిర్వహించారు. కరస్పాండెంట్ బి.సునీతారెడ్డి, సుబ్బారావు, జీఎన్‌రెడ్డి, కృష్ణ, పాపయ్య పాల్గొన్నారు. మండలంలోని మొగళ్లూరు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ బుజ్జమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.

➡ తోటపల్లిగూడూరు: మండలంలోని సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో సంబరాలు జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఎంఈఓ వేణుగోపాలరెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు బహుమతులను సమకూర్చుతున్న కొటక్ మహేంద్ర బ్యాంక్ బెస్తవారిపేట బ్రాంచ్ మేనేజర్ షేక్ అబ్దుల్ మునాఫ్‌ను అభినందించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, సర్పంచ్ చెరుకూరు సరళకుమా తదితరులు పాల్గొన్నారు.

➡ కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం హైస్కూల్లో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు నాటకం తిరుమలయ్య, నాయకులు వంశీ, కట్టా ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

➡ ముత్తుకూరు: మండలంలోని ముత్తుకూరు హైస్కూల్, సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్లో భోగి మంటలు వేశారు.

➡ ఇందుకూరుపేట: ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) పల్లిపాడులో ముందుస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. విశ్రాంత డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.రమేష్, ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పొదలకూరు: అంగన్‌వాడీ కేంద్రంలో..


మనుబోలు: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


ఇందుకూరుపేట: డైట్‌లో..


కొడవలూరు: యల్లాయపాళెం హైస్కూల్లో భోగి సంబరాలు


పొదలకూరు: అమరావతి స్కూల్లో..


టీపీగూడూరు: బహుమతుల అందజేత


ముత్తుకూరు: సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్లో..

క్రికెట్ పోటీలు ప్రారంభం

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభమైంది. నందమూరి బసవతారకరామ మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు జానా గిరిబాబు పర్యవేక్షణలో జరుగుతున్న పోటీలను నెల్లూరు కార్పొరేటర్ నాగరాజు ప్రారంభించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

మనుబోలు: పీఎంఎస్ఎంఏలో భాగంగా గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గేయ పూజిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజయ్య, సూపర్‌వైజర్ రమణయ్య, హైమవతి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల నిరసన

కొడవలూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి, బీజేపీ నేత అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యల్లాయపాళెంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని, కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరుతూ స్థానిక అంబేడ్కర్ విగ్రహం పాదాల వద్ద వినతిపత్రాన్ని ఉంచారు.

ఎన్పీఎస్ఎస్ యాప్‌పై అవగాహన

ఇందుకూరుపేట: మండలంలోని ఇందుకూరుపేటలో ఎన్పీఎస్ఎస్ (నేషనల్ పెస్ట్ సర్వేలెన్స్ సిస్టం) యాప్‌పై వ్యవసాయ శాఖ ఏడీ రాజ్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వీఎస్‌యూ అభివృద్ధికి కృషి

• ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) అభివృద్ధికి కృషి చేస్తున్నట్లుగా ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో గురువారం వివిధ విభాగ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల ప్రగతి, పరీక్షల నిర్వహణ, వేగంగా ఫలితాల విడుదల, కొత్త ప్రణాళికల అమలు తదితర అంశాలపై చర్చించారు. వర్సిటీ అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్ట్‌ల పురోగతిని సమీక్షించి, సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలను వివరించారు. పరీక్షల సంస్కరణలో భాగంగా ఈడీపీ సెల్ ఏర్పాటు, ఆన్‌లైన్ ఫీజు చెల్లింపుల పద్ధతులు, ప్రశ్నపత్రాల బ్యాంక్ అభివృద్ధి వంటి ప్రాధాన్యత కలిగిన అంశాల గురించి చర్చించి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, టి.వీరారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారిణి డాక్టర్ కె.మధుమతి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్షరాస్యత శాతం పెంపునకు కృషి చేద్దాం

కొడవలూరు: అక్షరాస్యత శాతాన్ని పెంపొందించేందుకు సమైక్యంగా కృషి చేద్దామని కావలి డివిజన్ వయోజన విద్య పర్యవేక్షకుడు ఒ.నారాయణరావు కోరారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా సంఘమిత్ర మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలకు వయోజన విద్య పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వయోజనులకు సైతం విద్య అవసరమన్నారు.

విద్యార్థులకు అభినందన

తోటపల్లిగూడూరు: కోడూరులోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లుగా ప్రిన్సిపల్ ఎస్తేరమ్మ తెలిపారు. గురువారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10వ తరగతి చదువుతున్న కీర్తిశ్రీ, రాజశ్రీ, అధ్యాపకులు కామాక్షమ్మ, నళిని రాణి రూపొందించిన నిత్య జీవితంలో త్రికోణమితీయ అనువర్తనాలు అనే ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే ప్రదర్శలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.


విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

ప్రగతి బాటలో కోవూరు

కొడవలూరు: కోవూరు నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ దూసుకుపోతోంది. కోవూరు, కొడవలూరు మండలాల్లో 35 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. దీంతో హైవేకు ఆనుకుని ఉన్న కోవూరు, కొడవలూరు మండలాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగుంది. నెల్లూరు నగరానికి కలిసిపోయినట్లుగా ఉండడం, నగర పంచాయతీగా ఉన్న బుచ్చిరెడ్డిపాళెం దాదాపు కలిసిపోయి ఉండడంతో రియల్ వ్యాపారం జరుగుతోంది. దీనికితోడు బుచ్చిరెడ్డిపాళెంలో 25 కిలోమీటర్ల మేర ముంబయి హైవే విస్తరించి ఉంది. దీంతో అడుగడుగునా గేటెడ్ కమ్యూనిటీ వెంచర్లు వెలిశాయి. వీటి మీద ఆధారపడి వేలాది మంది ఉపాధి పొందుతుండడం గమనార్హం.

రొయ్యల పరిశ్రమలకు ప్రసిద్ధి

కోవూరు నియోజకవర్గంలో విడవలూరు, ఇందుకూరుపేట మండలాలు తీర ప్రాంతం కలిగి ఉండడంతో రొయ్యల పరిశ్రమలు వెలిశాయి. వీటి ద్వారా స్థానికంగా ఉన్న నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారు.

విద్యాసంస్థలోనూ..

కొడవలూరు, కోవూరుల్లో రెండు ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. ఎన్‌హెచ్–16 పక్కనే ఒకటి, ముంబయి జాతీయ రహదారికి పక్కనే ఒకటి ఉన్నాయి. ఓ కళాశాలలో కేవలం ఇంజినీరింగ్ మాత్రమే కాకుండా ఫార్మసీ, టీటీసీ, ఎంసీఏ లాంటి ఉన్నత చదువులు అందుబాటులో ఉన్నాయి. దీంతో సమీప జిల్లాల వారు కూడా ఇక్కడికి వస్తున్నారు.

పర్యాటకంగానూ..

కోవూరు నియోజకవర్గం పర్యాటక పరంగానూ ప్రత్యేకతను సంతరించుకుంది. ఇందుకూరుపేట మండలం మైపాడు, విడవలూరు మండలం రామతీర్థం తీర ప్రాంతాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. నిత్యం ఇక్కడ పర్యాటకులు సందడి చేస్తుంటారు.

భక్తుల తాకిడి

ఇందుకూరుపేట మండలం గంగపట్నం చాముండేశ్వరీదేవి ఆలయం, విడవలూరు మండలం రామతీర్థం రామలింగేశ్వరస్వామి ఆలయం, కొడవలూరు మండలం గండవరంలోని ఉదయకోశ్వరస్వామి ఆలయాలు ప్రముఖ పుణ్యక్షేత్రాలుగా ఉన్నాయి.

పారిశ్రామికవాడగా సర్వేపల్లి

పొదలకూరు: జిల్లాలో సర్వేపల్లి నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. పారిశ్రామికవాడగా గుర్తింపు పొందింది. ఇక్కడ అదానీ కృష్ణపట్నం పోర్టు ఉంది. పరిశ్రమల స్థాపన వేగం జరిగింది. ఫలితంగా వ్యాపార, ఉద్యోగ రంగాల్లో అగ్రగామిగా ఉంది.

పరిశ్రమల స్థాపనతో ఉద్యోగాలు

సర్వేపల్లి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపన జరుగుతూనే ఉంది. నేలటూరు థర్మల్ విద్యుత్ ప్లాంట్‌తోపాటు వెంకటాచలం మండలం సర్వేపల్లి గ్రామ పరిధిలో క్రిబ్కో బయో ఇథనాల్ ప్లాంట్, విశ్వసముద్రకు శంకుస్థాపనలు జరిగాయి. ముత్తుకూరు మండలం పంటపాళెంలో పామాయిల్ ఫ్యాక్టరీలున్నాయి. పొదలకూరు మండలంలో రెండేళ్ల క్రితం వ్యవసాయ పనిముట్లు, యంత్రాల తయారీ కోసం కిసాన్ క్రాఫ్ట్ పరిశ్రమను రూ.100 కోట్లతో స్థాపించారు. ఇక్కడ నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పిస్తున్నారు.

విద్యారంగంలో..

విద్యా రంగంలో సర్వేపల్లి నియోజకవర్గానికి గుర్తింపు ఉంది. విక్రమ సింహపురి యూనివర్సిటీ వెంకటాచలం మండలంలో ఉంది. అనేక రకాల ప్రైవేట్ విద్యాసంస్థలు ముత్తుకూరు మండల పరిధిలో ఉన్నాయి. ఇంజినీరింగ్ కాలేజీలు, పోర్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పాఠశాల నిర్వహిస్తున్నారు. ఇతర జిల్లాల విద్యార్థులు యూనివర్సిటీలో చేరి వివిధ కోర్సుల్లో చదువుకుంటున్నారు. గొలగమూడి ఆశ్రమ పాఠశాలలో పేద విద్యార్థులు ఉచితంగా విద్యనభ్యసిస్తున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రం

ఈ నియోజకవర్గం ఆధ్యాత్మిక కేంద్రంగా కూడా భాసిల్లుతోంది. గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమానికి ఏపీలోనే కాక తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో గుర్తింపు ఉంది. ఆయా రాష్ట్రాల నుంచి భక్తులు ఆరాధన మహోత్సవాలకు హాజరవుతుంటారు. మనుబోలులో సోమేశ్వరాలయం, కసుమూరు దర్గా, తోటపల్లిగూడూరు జ్వాలాముఖి అమ్మవారి ఆలయం తదితరాలున్నాయి.

రియల్ ఎస్టేట్ వ్యాపారం

పొదలకూరు, ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు, తోటపల్లిగూడూరు మండలాలు జిల్లా కేంద్రమైన నెల్లూరుకు సమీపంలో ఉన్నాయి. పొదలకూరు పట్టణానికి సమీపంలో ఇటీవల ప్రైవేట్ లేఅవుట్లు పదుల సంఖ్యలో ఏర్పాటయ్యాయి. వెంకటాచలం, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లో లెక్కకు మించిన లేఅవుట్లున్నాయి. ముత్తుకూరు మండలం పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా ఉండటంతో భూముల ధరలు బాగా పెరిగాయి. పొదలకూరు – నెల్లూరు, సంగం – పొదలకూరు, మనుబోలు – పొదలకూరు మార్గాల్లో లేఅవుట్లు ఇటీవల ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.